# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-09-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- స్వచ్ఛభారత్ నిర్మాణానికి పారిశుధ్ద్య కార్మికులే స్ఫూర్తి ప్రదాతలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

- చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పిం చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా హ్యాండ్లూమ్ బజార్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.

- గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ అన్నారు.

- "ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్" కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీన ప్రారంభం కానుంది.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========================

"స్వచ్ఛభారత్" నిర్మాణానికి పారిశుధ్ద్య కార్మికులే స్ఫూర్తి ప్రదాతలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలోని ఎన్డీయే కార్యాలయంలో ఈ రోజు మంత్రి మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత 30 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఇద్దరి పారిశుధ్య కార్మికుల కాళ్లను కడిగారు. మున్సిపల్ కార్మికులు సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యాంచారు.

==========================

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చేనేత, జౌళి శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు, హ్యాండ్లూమ్ బజారులను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన హాండ్లూమ్ బజార్ ను ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో చేనేత దుస్తుల తయారీలో నూతన డిజైన్లు రూపొందిస్తున్నామని వివరించారు. చేనేత వస్త్రాల తయారీలో సహజసిద్ధమైన రంగుల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నేతన్నలు తయారు చేసే వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నామని వెల్లడించారు.

==========================

గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ అన్నారు. ఈ రోజు ప్రకాశం జిల్లా ఆయన పర్యటించారు. పర్యటనలో భాగంగా ఒంగోలు సమీపంలోని చింతల గ్రామంలో ఉన్న నక్కల రాణెమ్మ కాలనీని సందర్శించి, అక్కడ నివాసం ఉంటున్న 55 కుటుంబాలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారిని కోరారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి కేంద్రం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించనున్న సందర్భంగా పార్వతీపురంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 2వ తేదీన జార్ఖండ్ లోని హజారీబాగ్ లో పీఎం జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు, పీఎం ఉజ్వల్ యోజన, ఆధార్ కార్డుల నమోదు, జల్ జీవన్ మిషన్, ఇంటింటికి కుళాయ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని వివరించే స్టాల్స్ లను ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాల అధికారులకు కలెక్టర్ సూచించారు.

==========================

ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ పై వివిధ విభాగాల అధికారులతో ఈ రోజు నిర్వహించిన సమీక్షలో అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై శిక్షణ ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో అక్టోబరు నెలలో ప్రారంభించనున్న క్షేత్ర స్థాయి కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కె.వై.సీ.ల ప్రక్రియ నూరు శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందని, రైతులను సమీపంలో ఉన్న మిల్లుకు అనుసంధానం చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

===========================

గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ, మిరియాల పంటల దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి కె. కన్నబాబు పేర్కొన్నారు. ఈ రోజు ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం మోదపల్లి గ్రామ వద్ద కాఫీ తోటలను పరిశీలించారు. అక్కడ కాఫీ రైతులతో మాట్లాడి కాఫీ, మిరియాలు సాగు, దానిపై వస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బేబీ పల్పర్లు, ట్రసర్లు, టార్పాలిన్లు మంజూరు చేయాలని రైతులు కోరగా... అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం కన్నబాబు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేస్తున్న అరుకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి ఉందన్నారు. అనంతరం కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు సబ్బులు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

===========================

పిల్లల్లో ఉత్తమ అలవాట్లను పెంచుతూ.. వారు ఉన్నతులుగా ఎదిగే క్రమంలో గణిత విజ్ఞానం ముఖ్యమైన పాత్ర పోసిస్తుందని ఎన్.ఎస్.టి.ఎల్ శాస్త్రవేత్త వై.వీరాచారి పేర్కొన్నారు. విశాఖపట్నంలో విద్యా భారతీ ఆధ్వర్యంలో 2 రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళా- సాంస్కృతిక మహోత్సవాన్ని ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గణిత శాస్త్ర విజ్ఞానం చోటు చేసుకుంటున్న మార్పులను నేటితరం విద్యార్థులు గమనిస్తూ ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా భారతీకి చెందిన 160 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొంటున్నారు.

===========================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 4 మాడ వీధులను రంగవల్లికలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని వివరించారు. అదే విధంగా గ్యాలరీలలో భక్తులు కూర్చుని వాహన సేవలను తిలకించే విధంగా ఏర్పాటు చేశామని, వాహన సేవలను తిలకించే వారికి అన్న ప్రసాదాలను కూడా అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 1వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేయనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా అక్టోబర్ 1వ తేదీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

===========================

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చెయ్యాలని సంబంధిత అధికారులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. పాలకొల్లులో ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచిన నేపధ్యంలో నూతన భవనంలో అవసరమైన సౌకర్యాలు, వివిధ విభాగాల ఏర్పాటు అంశాలపై ఆసుపత్రి వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్షించారు. అన్ని రకాల సౌకర్యాలతో వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దాలని, సాధ్యమైనంత త్వరగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను మంత్రి సూచించారు.

===========================

తక్కువ నీటి వనరులతో ఎక్కువ సాగు సాదించే బిందు తుంపర్ల సేద్య పరికరాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు. బిందు తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబంధించి కుప్పం నియోజకవర్గానికి నిర్దేశించిన లక్ష్యాలపై ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తో కలెక్టర్ ఈ రోజు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో 3 వేల 600 హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్య పరికరాలను అందించేందుకు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి, పరికరాల పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు.

============================

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణ జిల్లా మచిలీపట్నంలో రైలుపేటలో ఈ రోజు మంత్రి పర్యటించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వృద్ధులు, వికలాంగులకు పెంచిన పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు పూర్తి స్థాయిలో ఒకటవ తేదీ నాటికి అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్లు రహదారులు, కాలువల నిర్మాణం పనులు ప్రారంభించామని తెలిపారు.

============================

============================